సాక్షి
నాగర్‌కర్నూల్

ఆదివారం । 2 । ఏప్రిల్ । 2023



పర్యాటక హామీ.. తీరేనా?
కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పర్యాటక ప్రాంతంగా అభివృద్ధికి నోచుకోవడం లేదు.

వివరాలు 8లో ▸



పూల రథోత్సవం
సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి పూల రథోత్సవం కనులపండువగా సాగింది.

వివరాలు 10లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
37.4 /22.6

రోజంతా ఎండ తీవ్రత సాధారణంగా ఉంటుంది. అప్పుడప్పుడూ ఆకాశం తేలిక పాటి మేఘావృతమై ఉంటుంది.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6-30
(ఆదివారం సాయంత్రం)

సహర్ 4-58
(సోమవారం తెల్లవారుజామున)

న్యూస్‌రీల్

శనేశ్వరాలయంలో పూజలు



బిజినేపల్లి: శనిదోష నివారణ కోసం ఆయా ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో వచ్చిన జేష్ఠాదేవి సమేత శనేశ్వరుడికి తిలతైలాభిషేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి ఆధ్వర్యంలో భక్తుల చేత పూజలు, హారతి, ప్రదక్షిణలు చేయించారు. అనంతరం పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు శివాలయంలో శివుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు.

మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఖాదర్‌పాషా



కొల్లాపూర్: టీపీసీసీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పట్టణానికి చెందిన ఎండీ ఖాదర్‌పాషా నియమితులయ్యారు. ఈ మేరకు ఖాదర్‌పాషకు శనివారం మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సోహెల్ నియామక పత్రం అందజేశారు. తనకు రాష్ట్రస్థాయిలో పదవి కట్టబెట్టేందుకు కృషిచేసిన కొల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు జగదీశ్వర్‌రావు, రాష్ట్ర అధ్యక్షుడు సోహెల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మైనార్టీలను సంఘటితం చేసి కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. ఖాదర్‌పాషాకు మైనార్టీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవి రావడం పట్ల నియోజకవర్గ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

పత్తి క్వింటా రూ.7,379
జడ్చర్ల/దేవరకద్ర: బాదేపల్లి మార్కెట్‌లో శనివారం పత్తికి గరిష్టంగా రూ.7,379, కనిష్టంగా రూ.5,689 ధరలు లభించాయి. అలాగే వేరుశనగకి గరిష్టంగా రూ.7,529, కనిష్టంగా రూ.5,169, మొక్కజొన్నకి గరిష్టంగా రూ.2,129, కనిష్టంగా రూ.1,679, జొన్నలు గరిష్టంగా రూ.5,640, కనిష్టంగా రూ.4,201, పొద్దుతిరుగుడు రూ.4,760, మినుములు రూ.5,342, కందులు గరిష్టంగా రూ.7,899, కనిష్టంగా రూ.7,370, పెబ్బర్లు రూ.4,869, ఉలువలు రూ.5,335, ఆముదాలు రూ.6,222, కనిష్టంగా రూ.5,942 ధరలు పలికాయి. దేవరకద్ర మార్కెట్‌లో ఆముదాలు గరిష్టంగా రూ.6,116, కనిష్టంగా రూ.6,093 ధరలు నమోదు కాగా.. ఆర్‌ఎన్‌ఆర్ సోనా గరిష్టంగా రూ.2,045గా ధర పలికింది.

7 నుంచి సంస్కృత సంభాషణ శిబిరం
స్టేషన్ మహబూబ్‌నగర్: సంస్కృత భారతీ జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 7 నుంచి 9 వరకు జడ్చర్ల పట్టణంలోని ఉదయ్ మెమోరియల్ స్కూల్‌లో ఉచిత సంస్కృత సంభాషణ శిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి పుట్టపాగ నాగరాజు, శిబిర ప్రముఖ్ మలిశెట్టి నాగరాజు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు ఈ శిబిరంలో పాల్గొనాలని, మిగతా వివరాల కోసం 79894 49098 నంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

మహనీయుల ఆశయాలతో ముందుకు..
మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మహాత్మాగాంధీ, డా.బీఆర్ అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని జేఎన్‌యూ (న్యూఢిల్లీ) అసోసియేట్ ప్రొఫెసర్ డా.జి.అజయ్ సూచించారు. శనివారం స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వెబినార్‌లో ఆయన మాట్లాడారు. మహనీయుల ఆలోచనా విధానాలు ఎంతో గొప్పవని పేర్కొన్నారు. డిగ్రీ కళాశాలల సంయుక్త సంచాలకులు డా.రాజేందర్‌సింగ్ మాట్లాడుతూ ఇలాంటి వెబినార్లతో విద్యార్థుల్లో సామాజిక అవగాహన పెరుగుతుందన్నారు. అందరూ ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. అనంతరం ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన మరో వెబినార్‌లో కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ఎం.నాగరాజు మాట్లాడారు. అధ్యాపకులు అంకితభావంతో పనిచేసి విద్యార్థులకు చక్కగా బోధించాలన్నారు.



సాహసయాత్ర.. సలేశ్వరం

తెలంగాణ అమరనాథ్ యాత్రగా ప్రసిద్ధి

- దట్టమైన నల్లమలలో కొలువుదీరిన లింగమయ్య
- 5, 6, 7 తేదీల్లో సలేశ్వరం బ్రహ్మోత్సవాలు
- పౌర్ణమి రోజు లక్షమందికిపైగా పుణ్యస్నానాలు
- ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకే అనుమతి

ఎత్తయిన కొండలు.. జాలువారే జలపాతాలు.. ప్రకృతి రమణీయతకు అద్దం పట్టే నల్లమల అటవీ ప్రాంతంలో కొలువుదీరిన సలేశ్వరం లింగమయ్య దర్శనం చేసుకోవాలంటే ఎంతో సాహసం చేయాల్సిందే. రాళ్లు.. రప్పల్లో కిలోమీటర్ల మేర కాలినడకన అడుగులు వేస్తూ.. కొండలు ఎక్కి దిగుతూ.. సహజసిద్ధంగా వెలసిన జలపాతాలను దాటుకొని పున్నమి వెన్నెల్లో స్వామి సన్నిధికి చేరుకోవాల్సి ఉంటుంది. లోయలో ప్రతిధ్వనించే లింగమయ్య నామస్మరణ.. దారి పొడవునా పడే నీటి తుంపర్లు.. వెయ్యి అడుగులపై నుంచి జాలువారే జలపాతం.. ఇలా ఒక్కో దృశ్యం ఒక్కో అద్భుతం. ఒక్కసారి ఈ యాత్ర చేస్తే జీవితాంతం గుర్తుండిపోతుంది. తెలంగాణ అమర్‌నాథ్ యాత్రగా ప్రసిద్ధిగాంచిన ఈ యాత్ర మరో మూడు రోజుల్లో ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో 'సాక్షి' ప్రత్యేక కథనం..



- సాక్షి, మహబూబ్‌నగర్ డెస్క్

ఇలా చేరుకోండి..
హైదరాబాద్– శ్రీశైలం జాతీయ రహదారి 765లోని **మన్ననూర్ అనంతరం ఫర్హాబాద్** చౌరస్తా వస్తుంది. **ఇది 157 కి.మీ. మైలురాయి వద్ద** ఉంటుంది. శ్రీశైలం **వైపు నుంచి వచ్చేవారు దోమల**పెంట, వట్టువర్లపల్లి **మీదుగా ఫర్హాబాద్ చౌరస్తాకు చేరు**కోవాలి. నల్లగొండ **నుంచి వచ్చేవారు మల్లేపల్లి, దేవర**కొండ, డిండి నుంచి **హాజీపూర్ చౌరస్తాకు వచ్చి అక్క**డి నుంచి శ్రీశైలం **మార్గంలో ఫర్హాబాద్ చేరుకోవాలి.** మిర్యాలగూడ నుంచి వచ్చే **అంగడిపేట, పెద్ద ఊర**, మల్లేపల్లి, దేవరకొండ, **డిండి మీదుగా హాజీపూర్** చౌరస్తా, మన్ననూర్ **మీదుగా ఫర్హాబాద్ వెళ్లాల్సి ఉ**ంటుంది. ఫర్హాబాద్ **చౌరస్తా హైదరాబాద్ నుంచి 157** కి.మీ., మహబూబ్‌న**గర్ నుంచి 131 కి.మీ., నల్లగొండ** నుంచి 141 కి.మీ., అచ్చంపేట నుంచి 38 కి.మీ., మన్ననూర్ నుంచి 18 కి.మీటర్ల దూరంలో ఉంటుంది. ఫర్హాబాద్ చౌరస్తా నుంచి అప్పాపూర్ చెంచుపెంట, రాంపూర్‌పెంట మీదుగా 31 కి.మీ. దూరంలో దట్టమైన అటవీ మార్గంలో సలేశ్వర క్షేత్రం ఉంటుంది.

■ ఇదే కాకుండా బల్మూర్, లింగాల– అప్పాయిపల్లి ద్వారా మరో మార్గం కూడా అందుబాటులో ఉంటుంది. అయితే అతి కష్టమీద సంగండి గుండాల వరకు ట్రాక్టర్ల ద్వారా వెళ్లేందుకు దారి ఉంది. కానీ, ఈ మార్గంలో భక్తులందరూ కాలినడకనే వెళ్తుంటారు.

పిడికెడు శివలింగం..
ఇత్తడితో చేసిన పడగ మధ్యలో కేవలం పిడికెడు ఎత్తు గల శివలింగం రూపంలో సలేశ్వర లింగమయ్య కొలువుదీరి ఉంటాడు. జలపాతం వద్ద భక్తులు కొండపైకి ఎగబాకి పుణ్యస్నానాలు ఆచరిస్తారు. లక్షలాది మందితో నల్లమల అడవి తల్లి నిండుగా కనిపిస్తుంది. ఈ ఉత్సవాల తర్వాత ఈ ప్రాంతానికి వెళ్లడానికి ఎవరూ సాహసించరు.

సలేశ్వరం లింగమయ్య దర్శనం ఓ మహత్తర ఘట్టం. పేద, ధనిక.. చిన్నా పెద్ద.. ముసలి ముతక.. ఇలా ఎవరైనా సరే ప్రమాదభరితమైన కొండల్లో కాలినడకన గంటల తరబడి నడిచి వెళ్లాల్సిందే. దర్శనానికి వెళ్లే ముందు.. 'వస్తున్నాం లింగమయ్య'.. తిరిగి వచ్చేటప్పుడు 'వెళ్లొస్తాం లింగమయ్య'.. అంటూ భక్తిపారవశ్యంతో కదులుతారు. ప్రతి ఏటా ఏప్రిల్‌లో వచ్చే చైత్ర పౌర్ణమి సందర్భంగా నిర్వహించే సలేశ్వరం జాతర తెలంగాణ అమర్‌నాథ్ యాత్రగా పేరుగాంచింది. అటవీశాఖ ఆంక్షల మధ్య ఏప్రిల్ 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు అనుమతి లభించింది. అది కూడా ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకే దర్శనానికి వెళ్లాల్సి ఉంటుంది.

■ నల్లమల లింగమయ్య యాత్ర 200 అడుగుల లోతున పదునైన రాళ్లతో కూడిన గుట్టను దిగడంతో ప్రారంభమవుతుంది. గుట్టను దిగిన తర్వాత 500 అడుగుల నుంచి 600 అడుగుల ఎత్తు ఉండే మరో గుట్టను 'వస్తున్నాం లింగమయ్య..' అంటూ భక్తి ప్రపత్తులతో వేడుకుంటూ ముందుకు సాగుతుంటారు. దాదాపు వెయ్యి అడుగులకు పైగా లోతైన లోయవైపు కొండ చరియలను ఆధారంగా చేసుకొని.. కర్రల సాయంతో దిగాల్సి ఉంటుంది. అతి ప్రమాదకరమైన కొండలు, లోయల్లో భక్తులు కాలినడక ప్రయాణం సాగిస్తుంటారు. అయితే సలేశ్వరం జాతర అంటేనే పున్నమి వెన్నెల్లో రాత్రి వేళ చేసే ప్రయాణం. అలాంటిది పగలు మాత్రమే అనుమతిస్తే మండుటెండల్లో కాలికి చెప్పులు లేకుండా రాళ్లు, రప్పల్లో కాలినడకన వెళ్లడం సాధ్యమయ్యేపనేనా అని భక్తులు, యాత్రికులు ప్రశ్నిస్తున్నారు.



దట్టమైన అడవిలో కొండలు ఎక్కుతూ సలేశ్వరం లింగమయ్య దర్శనానికి వెళ్తున్న భక్తులు (ఫైల్)

భక్తులకు వసతులు..
రాంపూర్ చెంచుపెంట నుంచి సలేశ్వరం వరకు విడిది, తాగునీటి కోసం అక్కడక్కడ ఏర్పాట్లు చేస్తున్నారు. రాంపూర్‌పెంట దాటిన తర్వాత వాహనాల పార్కింగ్ ఉంటుంది. ఇక్కడికి దగ్గరలో మోకాల కుర్వ, గాడిదదొన్న కాల్వ వద్ద విశ్రాంతి తీసుకోవచ్చు. అక్కడి నుంచి వెళ్లే దారిలో ఇప్పచెట్టుబండ, అప్పాయిపల్లి దారి, మైసమ్మకట్ట, పాపనాశనం, లోయప్రాంతం, బైరవుడి గుడి వస్తాయి. అనంతరం లోయలోకి దిగి ముందుకు వెళితే.. శంకుతీర్థం, సలేశ్వర తీర్థం గుండాలు వస్తాయి. సలేశ్వరతీర్థం వద్ద భారీ జలపాతం నుంచి నీరు జాలువారుతాయి. ఇక్కడి గుహలోనే సలేశ్వరం లింగమయ్య కొలువుదీరాడు.

■ జాతర జరిగే రోజుల్లో ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతుంది. ఈసారి కూడా అచ్చంపేట, నారాయణపేట, మహబూబ్‌నగర్, షాద్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, గద్వాల, నల్లగొండ జిల్లా దేవరకొండ, మిర్యాలగూడ డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులు నడిపేందుకు ఏర్పాట్లు చేశారు.

సీఎమ్మార్ త్వరగా అప్పగించాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ ఉదయ్‌కుమార్ తదితరులు

నాగర్‌కర్నూల్: సీఎమ్మార్ బియ్యాన్ని వెంటనే ఎఫ్‌సీఐకి అప్పగించాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అధికారులు, రైస్ మిల్లర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2022–23 సంవత్సరానికి సంబంధించిన జిల్లాలో పెండింగ్ ఉన్న రైస్ మిల్లులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకొని డెలివర్ చేయాలని, రైస్ మిల్లర్లు అవసరమైతే సమీపంలో ఉన్న రైస్ మిల్లుకు ధాన్యాన్ని సరఫరా చేసి మిల్లింగ్ త్వరగా అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీఎంఆర్ బియ్యం చేయని పక్షంలో రానున్న ఎండాకాలంలో వరి ధాన్యాన్ని మిల్లర్లకు నిలిపివేస్తామని హెచ్చరించారు. ప్రతిరోజూ రైస్ మిల్లుల నుంచి ఎంత బియ్యం సరఫరా చేస్తామనే విషయం ముందుగా సమాచారం అందించాలని చెప్పారు.

గొర్రెల పంపిణీకి చర్యలు

రెండో విడత గొర్రెల పంపిణీని పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో రెండో విడత గొర్రెల పంపిణీ, కంటివెలుగు, ఆరోగ్య మహిళా, జీఓ 58, 59,76, 118 ప్రకారం పట్టాల పంపిణీ, ప్రధానమంత్రి ఆవాస్ యోజన తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెల పంపిణీలో పారదర్శకత ఉండేందుకు జిల్లాస్థాయి అధికారులను పర్యవేక్షకులుగా నియమించాలన్నారు. సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ రాష్ట్రంలో 57 రోజుల్లో దాదాపు కోటి మందికి కంటి పరీక్షలు నిర్వహించడం పట్ల అభినందించారు. ఆయా సమావేశాల్లో అదనపు కలెక్టర్లు మనూచౌదరి, మోతీలాల్, పౌరసరఫరాల అధికారి మోహన్‌బాబు, సివిల్ సప్లయ్ డీఎం బాలరాజు, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి రమేష్, డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్, ఆర్డీఓలు నాగలక్ష్మి, రాజేష్‌కుమార్, హనుమానాయక్ తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఈఓ గోవిందరాజులు

కందనూలు: ఈ నెల 3 ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు డీఈఓ గోవిందరాజులు తెలిపారు. విద్యార్థులు ఒత్తిడి, ఆందోళనకు గురికాకుండా పరీక్షలు రాయాలని సూచించారు. పదో తరగతి పరీక్షలకు జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత, గీతాంజలి పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను శనివారం పరీక్షల నిర్వహణాధికారి రాజశేఖర్‌రావుతో కలిసి డీఈఓ పరిశీలించారు. జిల్లాలో పదో తరగతి పరీక్షలను షెడ్యూల్ ప్రకారం సోమవారం నుంచి 13 వరకు నిర్వహిస్తామన్నారు. జిల్లాలో 10,572 మంది పరీక్షలు రాస్తున్నారని, వీరి కోసం 61 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పరీక్ష ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, ఫస్ట్ లాంగ్వేజ్ కాంపోజిట్ కోర్సు, సైన్స్ పరీక్ష ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.50 గంటల వరకు జరుగుతుందన్నారు. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, పరీక్షలు రాసేందుకు అవసరమైన డ్యూయల్ డెస్క్‌లను అందుబాటులో ఉంచామని చెప్పారు. వేసవి దృష్ట్యా ప్రతి కేంద్రం వద్ద వైద్యసిబ్బందిని అవసరమైన మందులతో అందుబాటులో ఉంచుతామన్నారు. ప్రశ్నపత్రాల తరలింపులో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు హాల్ టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయని, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఫీజుల కోసం ఇబ్బందులకు గురిచేస్తే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్ష హాల్‌లోకి ఎలక్ట్రానిక్స్ వస్తువులు, గాడ్జెట్స్ తీసుకువెళ్లడానికి అనుమతి లేదని, పరీక్ష సమయం కంటే అరగంట ముందుగానే చేరుకోవాలని కోరారు. పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు ఆర్టీసీ బస్సులు ఉదయం, మధ్యాహ్నం నడుపుతున్నట్లు చెప్పారు. పరీక్షల కోసం జిల్లాలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, సమస్యలు, సందేహాలు ఉంటే కంట్రోల్ రూం సెల్ నం. 98850 17701 ఫోన్ చేయాలన్నారు.

ప్రైవేటు పాఠశాలల బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు

కందనూలు: జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి జిల్లాలోని 150 ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి ప్రైవేటు పాఠశాలల యాజమాన్య ప్రెసిడెంట్ యాదగిరి శేఖర్‌రావు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలను బలోపేతం చేస్తూ ఉన్నత ప్రమాణాలతో కూడిన గుణాత్మక విద్యను అందించాలని చెప్పారు. జిల్లాలోని 150కిపైగా ప్రైవేట్ పాఠశాలలు సభ్యత్వం తీసుకున్న సందర్భంగా వారికి సర్టిఫికెట్స్ ప్రదానం చేయడం జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్, జిల్లా అధ్యక్షుడు మహేష్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, కోశా ధికారి ఎండీ నయీం, వెంకటేశ్వరరావు, నరేష్, ఎండీ సులేమాన్, రఘుపతిరెడ్డి, సుదర్శన్‌గౌడ్, రాజశేఖర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళల్లో రక్తహీనత నివారణకు కృషి



మాట్లాడుతున్న జెడ్పీచైర్‌పర్సన్ శాంతికుమారి

కందనూలు: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వందశాతం పౌష్టికాహారం అందించి మహిళల్లో రక్తహీనత నివారణకు కృషిచేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ శాంతికుమారి అన్నారు. శనివారం పోషణ పక్షంలో భాగంగా జిల్లాకేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలు, సీడీపీఓలకు నిర్వహించిన మెడిటేషన్ శిక్షణ తరగతులను ఆమె కలెక్టర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాలతో చిన్నారులకు సంపూర్ణ పోషక విలువలు అందుతాయన్నారు. కలెక్టర్ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో పోషణ లోపంతో బాధపడుతున్న 4 వేలకు పైగా పిల్లలను 172 మందికి తగ్గించి రాష్ట్రస్థాయిలోనే జిల్లాను ముందంజలో నిలపడం అభినందనీయమన్నారు. అదే స్ఫూర్తితో జిల్లాలో ఉన్న మహిళలు, గర్భిణులు, కిశోర బాలికల్లో ఉన్న రక్తహీనత శాతాన్ని తగ్గించేందుకు చొరవ చూపాలన్నారు. ముఖ్యంగా గర్భిణులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని, పిల్లల్లో వయసుకు తగ్గ బరువు ఎత్తు సమస్యలను అధిగమించాలన్నారు. అంగన్‌వాడీల్లో ప్రీస్కూల్ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు అధునాతన పద్ధతులపై అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ తరగతులు చేపడుతామన్నారు. సమావేశంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి వెంకటలక్ష్మి, మెడిటేషన్ తరగతుల శిక్షకులు ఆంజనేయులు, పద్మజ, పోషక అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ విజ్ఞాన్, సఖి కోఆర్డినేటర్ సునీత, సీడీపీఓ సుజాత తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు పరిష్కరించాలి

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాలోని అన్ని కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించేందుకు న్యాయమూర్తులు కృషిచేయాలని హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి సాంబశివరావు నాయుడు అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జిగా నియామకమైన తర్వాత మొదటిసారి ఆయన జిల్లా కోర్టును శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజేష్‌బాబు, కలెక్టర్ ఉదయ్‌కుమార్ హైకోర్టు న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం అందజేసి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించి కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్‌అదాలత్‌లపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అంతకు ముందు జిల్లా ప్రధాన న్యాయమూర్తి చాంబర్‌ను, జిల్లా ప్రధాన కోర్టు హాల్‌లో ఏర్పాటు చేసిన నూతన జిరాక్స్, ఎలక్ట్రానిక్ పరికరాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి సబిత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి స్వరూప, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి మౌనిక, కల్వకుర్తి సీనియర్ సివిల్ జడ్జి కుమారస్వామి, అచ్చంపేట జూనియర్ సివిల్ జడ్జి విజయ్‌కుమార్, కొల్లాపూర్ జూనియర్ సివిల్ జడ్జి వెంకటరమణ సుజన్, బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రఘునాథరావు, ప్రధాన కార్యదర్శి పర్వత్‌రెడ్డి, డీఎస్పీ మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కోర్టు ఆవరణలో మొక్క నాటుతున్న హైకోర్టు న్యాయమూర్తి సాంబశివరావునాయుడు

క్లుప్తంగా

వ్యక్తి బలవన్మరణం



చెన్నకేశవులు (ఫైల్)

జడ్చర్ల టౌన్: మండలంలోని ఆల్వాన్‌పల్లికి చెందిన కొండేటి చెన్నకేశవులు (32) శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇనుప రాడ్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. భార్యాభర్తల మధ్య జరిగిన గొడవలతో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. చెన్నకేశవులు తల్లి భీమమ్మ ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు వివరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కోడేరు: మండలంలోని మూలమడతతండాకు చెందిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతిచెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ నానూనాయక్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. తండాకు చెందిన గొడ్‌నాయక్ (37)కు ఈర్లకుంటతండాకు చెందిన మంగమ్మతో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు సంతానం. నాలుగేళ్ల కిందట భార్యాభర్తలకు గొడవ జరిగి భార్య మంగమ్మ పిల్లలతో కలిసి తల్లిగారి ఇంటికి వెళ్లిపోయింది. కాపురానికి రావాలని పలుమార్లు కోరినా.. రాకపోవడంతో గొడ్‌నాయక్ మతిస్థిమితం కోల్పోయి మూడు నెలలుగా తిరుగుతున్నాడు. చివరకు పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గొడ్‌నాయక్ తమ్ముడు లక్ష్మణ్ నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ వివరించారు.

యువకుడి గల్లంతు

జడ్చర్ల: బాదేపల్లి పాతబజార్‌కు చెందిన విష్ణు (22) ఆలూరు సమీపంలోని కర్వెన రిజర్వాయర్‌లో శనివారం గల్లంతైనట్లు ఎస్‌ఐ లెనిన్ తెలిపారు. స్నేహితులతో కలిసి ఈత కొట్టేందుకు వెళ్లిన విష్ణు నీటిలో మునిగిపోగా.. సాయంత్రం కుటుంబ సభ్యులకు మిత్రులు సమాచారం అందించారు. గల్లంతైన యువకుడు బీటెక్ చదివేవాడని.. రాత్రి కావటంతో గాలింపు చర్యలు నిలిపివేసినట్లు వివరించారు.

విద్యార్థిని అదృశ్యం

మహబూబ్‌నగర్ క్రైం: ఇంటర్ పరీక్ష రాయడానికి వెళ్లిన ఓ విద్యార్థిని తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు టూటౌన్ ఎస్‌ఐ సుజాత తెలిపారు. ఆమె కథనం మేరకు.. జిల్లాకేంద్రంలోని కొత్తగంజ్ ప్రాంతానికి చెందిన శిరీష మార్చి 29న ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష రాయడానికి ఇంటి నుంచి వెళ్లింది. సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. నారాయణపేట జిల్లా కొల్లంపల్లికి చెందిన రాజు అనే యువకుడిపై అనుమానం ఉందని విద్యార్థిని తల్లి అనంతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

వివాహిత..

తన భార్య కనిపించడం లేదంటూ భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు టూటౌన్ ఎస్‌ఐ రవిప్రకాష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్‌లోని ప్రేమ్‌నగర్‌కు చెందిన గణేష్, జడ్చర్ల మండలం లింగంపేటకు చెందిన సుష్మిత నాలుగు నెలల కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం సుష్మిత మూడు నెలల గర్భిణి. శుక్రవారం భర్త గణేష్ పనికి వెళ్లి సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చి చూడగా భార్య కనిపించకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

గద్వాలలో..

గద్వాల క్రైం: ఓ విద్యార్థిని అదృశ్యమైన ఘటన పట్టణ పోలీసు స్టేషన్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ అబ్దుల్ షుకూర్ కథనం మేరకు.. పట్టణానికి చెందిన విద్యార్థిని గద్వాలలోని ఓ ఆస్పత్రిలో అప్రెంటీస్ చేస్తోంది. శుక్రవారం సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు స్నేహితులు, బంధువుల వద్ద వాకాబు చేశారు. ఎలాంటి ఫలితం లేకపోవడంతో శనివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురు రిమాండ్‌కు..

ఉండవెల్లి: మండలంలోని అలంపూర్ రోడ్డులో ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రిప్పర్లను 30వ తేదీన పట్టుకున్న కేసులో కృష్ణారెడ్డి, ముర్తుజావలి, కృష్ణయ్యను శనివారం గద్వాల కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి గాయత్రి ఇచ్చిన తీర్పు మేరకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ బాలరాజు తెలిపారు. అలాగే గత నెల 23న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందడంతో ఇందుకు కారణమైన అల్తాఫ్‌ను కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి గాయత్రి రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ వివరించారు.

గుండెపోటుతో యువకుడు మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: గుండెపోటుతో ఓ యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని మంతటిగేట్ చౌరస్తాలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. వంగూరు మండలం చింతపల్లికి చెందిన రాజేష్ (23) పని నిమిత్తం జిల్లాకేంద్రానికి వచ్చి తిరిగి గ్రామానికి బయలుదేరారు. మధ్యాహ్న సమయంలో మంతటి గేట్ చౌరస్తాకు చేరుకోగానే గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకొని మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లారు. ఈ ఘటనకు సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

పర్యాటక హామీ.. తీరేనా?

- మహబూబ్‌నగర్ జిల్లాలో ఏకైక ప్రాజెక్టు కోయిల్‌సాగర్
- హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న పర్యాటకులు
- మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్న వైనం



కోయిల్‌సాగర్ ప్రాజెక్ట్ (ఫైల్)

చుట్టూ కొండలు, అందమైన ప్రకృతి, ఆహ్లాదకరమైన వాతావరణంతో అందరినీ ఆకర్షించే జలాశయం కోయిల్‌సాగర్ ప్రాజెక్ట్. వర్షపు నీరు ఆధారంగా, కేవలం రెండు గుట్టలను అనుసంధానంగా చేసుకొని నిర్మించిన ఈ ప్రాజెక్టు నిర్మాణనైపుణ్యం చూపరులను ఆశ్చర్యానికి గురిచేస్తుంది. గేట్లు ఎత్తిన సమయంలో ప్రాజెక్టు అందాలు చూడటానికి జిల్లా నుండే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ మౌలిక వసతులు లేక సందర్శకులు ఇబ్బందిపడుతున్నారు. పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు అన్ని అవకాశాలు ఉన్నప్పటికీ.. మారుతున్న ప్రభుత్వాలు, మాటలకే పరిమితమైన నేతల హామీలతో ఏళ్లుగా నిరాదరణకు గురవుతున్న జిల్లాలోని ఏకైక, ప్రతిష్టాత్మక కోయిల్‌సాగర్ ప్రాజెక్ట్‌పై సాక్షి ప్రత్యేక కథనం..

– దేవరకద్ర రూరల్

ప్రాజెక్ట్ నిర్మాణం ఇలా..

కోయిల్‌సాగర్ ప్రాజెక్ట్‌ను ఏడవ నిజాం మీర్ ఉస్మాన్‌అలీఖాన్ పాలన 1945లో రూ.85 లక్షల అంచనా వ్యయంతో సిమెంట్ వినియోగం లేకుండా, డంగు సున్నంతో రెండు గుట్టలను అనుసంధానంగా చేసుకొని నిర్మించారు. ఈ ప్రాజెక్ట్ అప్పటి అద్భుతమైన ఇంజనీరింగ్ నైపుణ్యానికి సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. నీటినిల్వ సామర్థ్యం 2.276 టీఎంసీలు. దేవరకద్ర, ధన్వాడ, కోయిల్‌కొండ మండలాల పరిధిలో 12వేల ఎకరాలకు సాగునీరు అందించడం లక్ష్యంగా నిర్మించారు. దీని నిర్మాణానికి దాదాపు ఎనిమిది సంవత్సరాలు పట్టింది. స్వాతంత్ర్యం సిద్ధించిన అనంతరం 1955లో అప్పటి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.ఎం ఖర్జూ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా ఆయకట్టుకు తొలిసారి నీటిని విడుదల చేశారు.



కోయిల్‌సాగర్ ప్రాజెక్ట్ వద్ద పర్యాటకుల సందడి



1950లో నిర్మాణ దశలో కోయిల్‌సాగర్ ప్రాజెక్ట్

కనీస వసతులు కరువు..

జిల్లాలోని ఏకైక ప్రాజెక్టు ఇదే కావడం, పర్యాటకులకు అనువైన వాతావరణం ఉండటం, గేట్లు ఎత్తకపోయినా ప్రాజెక్టు అందాలను వీక్షించే అవకాశం ఉండటం కలిసివచ్చే అంశం. ఈ కారణంగానే నిత్యం కోయిల్‌సాగర్‌కు అనేక మంది పర్యాటకులు కుటుంబాలతో వచ్చి సేద తీరుతారు. నీడ, తాగునీరు వంటివి, మౌలిక వసతులు లేకపోవడం వల్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వీకెండ్‌లో ఇక్కడ గడిపేందుకు హైదరాబాద్, ఇతర రాష్ట్రాల నుంచి సందర్శకులు వస్తారు. గుడారాలు వేసుకుని గడుపుతారు.

అనువైన ప్రదేశం..



కోయిల్‌సాగర్‌ను పర్యాటక కేంద్రంగా రూపొందించేందుకు అనువైన ప్రదేశం. చుట్టూ పచ్చని పొలాలతో ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. ప్రాజెక్టు నిండిన సమయంలో పర్యాటకుల తాకిడి అధికంగా ఉంటుంది. వారికి కనీస సౌకర్యాలు లేక ఇబ్బందిపడుతున్నారు. పాలకులు, అధికారులు ఇప్పటికైనా పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి.

– ఖదీర్, దేవరకద్ర

సౌకర్యాలు లేవు..



ప్రాజెక్ట్ వద్ద ఉన్న ప్రశాంతమైన వాతావారణంలో గడిపేందుకు నిత్యం అనేక మంది వస్తుంటారు. వారికి ఇక్కడ కనీస వసతులు కల్పించాలి. ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేసే హామీలు వెంటనే అమలుచేయాలి. కేఎస్పీని పర్యాటక పరంగా అభివృద్ధి చేస్తే జిల్లాలో ప్రత్యేక ప్రాంతంగా మారుతుంది.

– కృష్ణారెడ్డి, దేవరకద్ర

కల నెరవేరేనా?

ప్రాజెక్ట్ నిర్మించి దాదాపు 68 ఏళ్లు గడిచింది. ఉమ్మడి రాష్ట్రంలో పర్యాటక కేంద్రంగా కేఎస్పీని తీర్చిదిద్దుతామని పాలకులు ఇచ్చిన హామీలు మాటలకే పరిమితమయ్యాయి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత ప్రాజెక్ట్‌లో ఏడాదంతా నీరు ఉండేలా ప్రణాళికలు రూపొందించారు. పాలమూరు– రంగారెడ్డి పథకంలో భాగంగా కర్వెన రిజర్వాయర్ పూర్తయితే అక్కడి నుంచి గొండ్యాల మీదుగా కాల్వల ద్వారా నేరుగా కోయిల్‌సాగర్‌కు నీరు అందించే విధంగా ప్రస్తుతం డిజైన్ రూపొందించారు. అది పూర్తయితే నిత్యం నీటితో నిండుగా ఉంటూ కోయిల్‌సాగర్ రిజర్వాయర్‌గా మారుతుంది. అప్పుడు పూర్తిస్థాయి సందర్శక ప్రాంతంగా మారుతుంది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని రూ.8కోట్ల ప్రతిపాదనలతో ప్రాజెక్ట్‌తో పాటు, కోయిల్‌కొండ కోట, రామగిరి, రాంకొండలను కలిపి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. దీనికోసం ప్రాజెక్టు వద్దకు పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, రాజేందర్‌రెడ్డిలతో పాటు టూరిజం శాఖ ఎండీ మనోహర్, ఇతర అధికారులు వచ్చి హరిత హోటల్‌తో పాటు, కాటేజీలు, బోటింగ్ ఏర్పాటు చేసే దిశగా డిజైన్‌లు రూపొందించేందుకు స్థలపరిశీలన చేశారు. ఇది జరిగి 15నెలల అవుతున్నా పనులు ప్రారంభం కాలేదు. ఇప్పటికైనా పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని స్థానికులు కొరుతున్నారు.



ప్రాజెక్ట్ వద్ద బోటును ప్రారంభిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే (ఫైల్)

'వెల్టూరు ఘటనపై విచారణ జరపాలి'



ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన బిసి పొలిటికల్ జేఏసి నాయకులు

వనపర్తి క్రైం: పెద్దమందడి మండలం వెల్టూరు ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ శనివారం బాధితులతో కలిసి ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన నర్సింహులు భూమిని కొందరు రియల్ వ్యాపారులు ఆక్రమించి అతడిపై దాడిచేసే ప్రయత్నం చేశారని.. ఈ విషయమై ఫిర్యాదు చేసి 80 రోజులు దాటినా, నేటికీ చర్యలు తీసుకోలేదని వివరించారు. ఎస్పీ స్పందించి బాధితులకు న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అంజన్న, మహేందర్, శేఖర్, బాలు, గ్రామస్తులు రమేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

చింతపండు @ రూ.8,888



నారాయణపేట: జిల్లాకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు చరిత్రలోనే శనివారం చింతపండు క్వింటాల్‌కు గరిష్టంగా రూ.8,888, కనిష్టంగా రూ.3,597 ధర పలికింది. శనగలు గరిష్టంగా రూ.5,050, కనిష్టంగా రూ.4,889, ఆముదాలు గరిష్టంగా రూ.5,944, కనిష్టంగా రూ.5,788, పెసర గరిష్టంగా రూ.8,912, కనిష్టంగా రూ.7,506, వేరుశనగ గరిష్టంగా రూ.6,209, కనిష్టంగా 4,500, జొన్నలు గరిష్టంగా రూ.5,200, కనిష్టంగా రూ.4,919, ఆలసందలు గరిష్టంగా రూ.6,509, కనిష్టంగా రూ.4,025, ఎర్ర కందులు సరాసరిగా రూ.8,409, తెల్ల కుసుమలు గరిష్టంగా రూ.4,105, కనిష్టంగా రూ.3,842, చింతపండు బోటు క్వింటాకు గరిష్టంగా రూ.1,650, కనిష్టంగా రూ.1,400, పత్తి క్వింటా గరిష్టంగా రూ.7,550, కనిష్టంగా రూ.4,500 చొప్పున లభించాయి.

నకిలీ నోట్లతో మోసాలు

అమాయకులను బురిడీ కొట్టిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్

- బాధితుల నుంచి రూ.71 లక్షలు వసూలు చేసిన నిందితులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ కె.నరసింహ



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కె.నరసింహ

మహబూబ్‌నగర్ క్రైం: అత్యాశతో అధిక డబ్బు సంపాదించాలనుకునే వారి బలహీనతను ఆసరాగా చేసుకొని నకిలీ నోట్లతో వీడియోలు సృష్టించి మోసాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాను మహబూబ్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ కె.నరసింహ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లాకు చెందిన చెంచు రంగస్వామి, అతడి భార్య భార్గవి, విష్ణు, శేఖర్, విజయ్ కుమార్, ప్రదీప్, దివాకర్ ఓ ముఠా ఏర్పడ్డారు. డబ్బంటే అత్యాశ ఉన్న అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకొని మోసాలకు పాల్పడం ప్రారంభించారు. మిడ్జిల్ మండలం మల్లాపూర్‌కు చెందిన వివేకానందగౌడ్‌తో పాటు రంగారెడ్డి జిల్లాకు చెందిన మహేష్, నరేష్, శేఖర్, జంగయ్యతో వీరికి పాత పరిచయాలున్నాయి. పది నెలలుగా వారితో సన్నిహితంగా ఉంటూ నకిలీ రూ.రెండు వేలు, రూ.500 నోట్లను కట్టలుగా అమర్చి వీడియోలు తీసి కొంత డబ్బును కుప్పగా పోసి పూజలు చేస్తే అవి రూ.కోట్లకు పెరుగుతున్నట్లు వీడియోలు సృష్టించి వారిని నమ్మించారు. దీంతోపాటు ఒక చెంబును కొనుగోలు చేసి కెమికల్ పూసి రేడియేషన్ పవర్ వచ్చేలా చేసి బంగారంగా మార్పు చేసినట్లు సృష్టించారు. ఆ చెంబును విక్రయిస్తే రూ.కోట్లు వస్తాయని తయారుచేసిన వీడియోను బాధితులకు పంపిస్తూ నమ్మించారు. ఇదే సమయంలో పలుమార్లు బాధితుల దగ్గరకు వచ్చి వాట్సాప్‌లో వీడియోలు చూపిస్తూ మోసం చేసి వారి నుంచి రూ.71.50 లక్షలు నగదును వివిధ సమయాల్లో తీసుకున్నారు. దాంతో స్వగ్రామంలో నాలుగెకరాల 49 సెంట్ల వ్యవసాయ భూమి, మహేంద్ర థార్ కారుతో పాటు ఇతర స్థిర, చరాస్తులను రంగస్వామి కొనుగోలు చేశారు. అదేవిధంగా మహేష్ అనే వ్యక్తితో బలవంతంగా మహేంద్ర కారు తీసుకొని తన అవసరాలకు వాడుకున్నారు. దీంతోపాటు నందికొట్కూర్‌కు చెందిన బాబు అనే వ్యక్తి నుంచి మరో మహీంద్రా కారు తీసుకొని తనతో పాటు ఉన్న సహచరుల ప్రయాణం కోసం వాడుకున్నారు. రెట్టింపు చేసి ఇస్తామన్న డబ్బులు కాదు కదా.. తీసుకున్న అసలు కూడా ఇవ్వకపోవడంతో అనుమానం వచ్చిన బాధితుడు వివేకానందగౌడ్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. మిడ్జిల్ పోలీసులతో పాటు జిల్లా పోలీసులు ప్రత్యేక బృందం ఏర్పాటుచేసి నేరస్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి మూడు కార్లు, భూమి పత్రాలు, ఫేక్ కరెన్సీ రూ.2 వేల నోట్లకు సంబంధించి 15 షీట్స్, రూ.500 నోట్లకు సంబంధించి ఐదు షీట్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో చెంచు రంగస్వామి, శేఖర్, విజయ్‌కుమార్, ప్రదీప్, దివాకర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా, చెంచు భార్గవి, విష్ణు పరారీలో ఉన్నారని వివరించారు. సమావేశంలో డీఎస్పీ టి.మహేష్, సీఐ జమ్ములప్ప, ఎస్‌ఐలు రాంలాల్, శ్రీనివాస్, జయప్రసాద్, కానిస్టేబుల్స్ తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న నకిలీ నోట్లు, సెల్‌ఫోన్లు

ఆభరణాల సంచి మాయం

వనపర్తి క్రైం: వనపర్తి మండలం చిట్యాలకు చెందిన అరుణ జిల్లాకేంద్రంలోని కేడీఆర్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. శ్రీరామనవమి సందర్భంగా కుమార్తె కావ్యతో కలిసి చిట్యాలకు వెళ్లింది. వేడుకలు ముగిసిన అనంతరం 30వ తేదీ రాత్రి తన వద్ద ఉన్న 30 తులాల బంగారు ఆభరణాలు సంచిలో పెట్టుకొని కుమార్తెతో కలిసి అరుణ స్కూటీపై వనపర్తికి బయలుదేరింది. గాంధీచౌక్ వచ్చేసరికి నగల సంచి కనిపించలేదు. ఎక్కడ వెదికినా ఫలితం లేకపోవడంతో శనివారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసునమోదు చేసినట్లు రెండో ఎస్‌ఐ రాము తెలిపారు.

పశువుల సంత టెండర్ ఖరారు

- అప్‌సెట్ ప్రైస్ తగ్గించి ఖరారు చేసిన వైనం



టెండర్లు నిర్వహిస్తున్న అధికారులు

కోస్గి: పశువుల సంత టెండర్ ఎట్టకేలకు శనివారం నాటకీయ పరిస్థితుల మధ్య అధికారులు ఖరారు చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన అప్‌సెట్ ప్రైస్ రాలేదనే కారణంతో మూడుసార్లు టెండర్‌ను రద్దు చేసిన మున్సిపల్ పాలకవర్గం అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వ నిర్ణీత ధరను రూ.94.53 లక్షలు ఉండగా రూ.60 లక్షలుగా అప్‌సెట్ ప్రైస్ ఖరారు చేస్తూ తీర్మానించారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో చైర్మన్ శిరీష అధ్యక్షతన ఏర్పాటు చేసిన టెండర్ ప్రక్రియలో కమిషనర్ పూర్ణచందర్‌రావు టెండర్లు నిర్వహించారు. పశువుల సంత కోసం 7 మంది దరఖాస్తు చేసుకొని పోటీలో పాల్గొనగా రంజిత్‌కుమార్ అత్యధికంగా రూ.60.11 లక్షలు పాడి పశువుల సంతను దక్కించుకున్నాడు.

అంతా గోల్‌మాల్..

నిబంధనల మేరకు టెండర్ నిర్వహించే తేదీని ముందుగానే నిర్ణయించి గతంలో వారంరోజుల పాటు విస్తృతంగా ప్రచారం చేసేవారు. పేపర్‌లో ప్రకటనలు ఇచ్చి అధికంగా టెండర్లు వచ్చేలా చూసే ఆనవాయితీకి మున్సిపల్ అధికారులు మంగళం పాడారు. ఈ ఏడాది టెండర్లు ఎలాంటి ముందస్తు ప్రచారం లేకుండా లోలోపల కుమ్మక్కై టెండ'రింగ్' చేపట్టడం సర్వత్ర విమర్శలు వస్తున్నాయి. గతేడాది పశువుల సంత రూ.90.05 లక్షలకు ఖరారు కాగా ఈ ఏడాది టెండ'రింగ్' జరగడంతో కేవలం రూ.60.11 లక్షలకు ఖరారు చేశారు. గతేడాది కంటే తక్కువకు టెండర్ ఖరారు చేయడం, అధికారుల కుమ్మక్కు టెండరింగ్‌కు అద్దం పడుతుంది. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్‌రావు స్పందిస్తూ నిబంధనల మేరకు మూడుసార్లు టెండర్లు రద్దయితే కౌన్సిల్ సమావేశంలో తుది నిర్ణయం తీసుకొని తీర్మానం చేయాల్సి ఉంటుందన్నారు. అప్‌సెట్ ప్రైస్ తగ్గించి టెండర్ నిర్వహించామని, వీటికి సంబంధించిన సమగ్ర వివరాలను కలెక్టర్‌కు పంపిస్తామని, ఆయనే తుది నిర్ణయం తీసుకుంటారని చెప్పారు.

సకాలంలో యూనిఫామ్స్ అందేనా?

- 75,922 మంది విద్యార్థులకు 3.86 లక్షల మీటర్ల వస్త్రం ఇచ్చేలా ఇండెంట్



జడ్చర్ల ఎమ్మార్సీలో వస్త్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ మంజుల, అధికారులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: వచ్చే విద్యా సంవత్సరం పాఠశాలలు తెరిచేలోగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఒకజత యూనిఫాం ఇవ్వాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ప్రతి ఏటా రెండు జతల దుస్తులు ఇవ్వాల్సి ఉండగా.. అందులో ఒక జత బడులు ప్రారంభించే నాటిని ఇవ్వాలని తీర్మానించారు. జిల్లాలో 17 మండలాలు ఉండగా.. ఇప్పటికే 15 మండలాలకు వస్త్రం చేరింది. మిగిలిన రెండు మండలాలకు వారంలోగా అందే అవకాశాలున్నాయి. తాజా యూడైస్ వివరాల ఆధారంగా 856 పాఠశాలల్లో 75,922 మంది విద్యార్థులు ఉండగా.. వీరికి రెండు జతల చొప్పున 1,51,844 యూనిఫామ్స్ కుట్టేందుకు 3.86 లక్షల మీటర్ల వస్త్రం అవసరం అవుతుంది. అయితే ఇప్పటికే 80 వేల మీటర్ల వస్త్రం ఎమ్మార్సీలకు చేరింది. మండలంలో స్థానికంగా ఉండే టైలర్‌తో ఒప్పందం చేసుకొని కుట్టేందుకు ఇవ్వాల్సి ఉంది.

ప్రభుత్వ ఆదేశాల మేరకు..

పాఠశాలలు తెరిచిన తర్వాత విద్యార్థులకు సకాలంలో యూనిఫామ్స్ కుట్టి ఇచ్చేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అందుకోసం సెలవుల్లో కుట్టించి పాఠశాలలు తెరిచేలోగా ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పటికే కొంత వస్త్రం మండలాలకు చేరింది.

– యాదయ్య, డీఈఓ

క్లుప్తంగా...

మామిడి రైతులకు 'అకాల' నష్టం


పెనుబల్లి మండలం కారాయిగూడెంలో మామిడి కాయలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య, అధికారులు

పెనుబల్లి/వేంసూరు: ఖమ్మం జిల్లా పెనుబల్లి, వేంసూరు తదితర మండలాల్లో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలుల వర్షానికి మామిడి రైతుల ఆశలు ఆవిరయ్యాయి. పలుచోట్ల తోటల్లో కోతకు వచ్చిన మామిడికాయలు నేలరాలడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లో శనివారం సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, వ్యవసాయ, ఉద్యాన శాఖ జిల్లా అధికారులు విజయనిర్మల, అనసూర్య పర్యటించి తోటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలు ఆరా తీశారు. అనంతరం ఎమ్మెల్యే వెంకటవీరయ్య మాట్లాడుతూ గత నెలలో కురిసిన వర్షానికి రైతులు నష్టపోగా.. సీఎం కేసీఆర్ పరిశీలించి పరిహారం ప్రకటించారని తెలిపారు. మళ్లీ రైతులు నష్టపోయిన నేపథ్యంలో సమస్యను వ్యవసాయ శాఖ మంత్రితో పాటు సీఎం కార్యాలయం దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి సోమవారం వేంసూరు మండలంలో పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారని తెలిపారు.

దివ్యదర్శనం టోకెన్ల జారీ పునఃప్రారంభం

తిరుమల: తిరుమల నడకమార్గాల్లో దివ్యదర్శనం టోకెన్ల జారీని టీటీడీ శనివారం ఉదయం నుంచి పునః ప్రారంభించింది. కోవిడ్ నేపథ్యంలో మూడు సంవత్సరాలుగా టీటీడీ దివ్యదర్శనం టోకెన్ల జారీని నిలిపివేసింది. అయితే భక్తుల కోరిక మేరకు అలిపిరి నడక మార్గంలో గాలిగోపురం వద్ద 10 వేలు, శ్రీవారి మెట్టు మార్గంలో ఐదు వేల దివ్యదర్శనం టోకెన్లను శనివారం నుంచి కేటాయిస్తున్నారు. భక్తులు నేరుగా తమ ఆధార్ కార్డుతో హాజరైతేనే టోకెన్లు జారీ చేస్తారు. కాగా, శ్రీవారి ఆలయంలో ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు మూడు రోజులపాటు సాలకట్ల వసంతోత్సవాలు వైభవంగా జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో 4న అష్టదళ పాదపద్మారాధన, 3 నుంచి 5వ తేదీ వరకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

వైద్య విద్య మరింత ఖరీదు?

- యూజీ, పీజీ మెడికల్, పారామెడికల్ కోర్సుల ఫీజు పెంపుపై టీఏఎఫ్‌ఆర్సీ కసరత్తు
- ఈ నెల 30లోగా కాలేజీల వారీగా ప్రతిపాదనలు కోరిన కమిటీ
- ఆదాయ, వ్యయాల ఆడిట్ రిపోర్టులు కూడా ఇవ్వాలని ఆదేశం
- వాటిని పరిశీలించాక ప్రభుత్వానికి నివేదిక
- రాష్ట్ర ప్రభుత్వం ఆమోదిస్తే అమల్లోకి కొత్త ఫీజులు!



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వైద్య విద్య మరింత ఖరీదు కాబోతోంది. ఇప్పటికే ప్రైవేటు కాలేజీల్లో మెడికల్ కోర్సుల ఫీజులు భారీగా ఉండగా, మరింత పెరిగే పరిస్థితి కనిపిస్తోంది. దీనిపై రాష్ట్రంలోని ప్రైవేటు మెడికల్ కాలేజీలు అటు ప్రభుత్వానికి వినతులు సమర్పిస్తూనే.. ఇటు తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీ రెగ్యులేటరీ కమిటీ (టీఏఎఫ్‌ఆర్సీ)కి సైతం విజ్ఞప్తులు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో 2023–24 నుంచి 2025–26 మధ్య కాలానికి సంబంధించి ఫీజుల నిర్ధారణపై కసరత్తు మొదలుపెట్టిన టీఏఎఫ్‌ఆర్సీ తాజాగా నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 30వ తేదీలోగా మెడికల్ కాలేజీల వారీగా ప్రస్తుతం ఫీజులు, పెంపునకు సంబంధించిన ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించింది.

కేటగిరీల వారీగా ఫీజులు

మెడికల్ కోర్సులకు సంబంధించి ఫీజులు ఒక్కో కేటగిరీలో ఒక్కో రకంగా ఉన్నాయి. ప్రభుత్వ కాలేజీల్లో స్థిరమైన ఫీజులుండగా.. ప్రైవేటు కాలేజీల్లో మాత్రం ఏ, బీ, సీ కేటగిరీల్లో భిన్నమైన ఫీజులు తీసుకుంటున్నారు. ప్రైవేటు కాలేజీల్లో ఎంబీబీఎస్ సీట్లకు సంబంధించి కేటగిరీ 'ఏ' (కన్వీనర్ కోటా) అడ్మిషన్‌కు వార్షిక ఫీజు రూ.60వేలు ఉండగా.. కేటగిరీ 'బీ' (మేనేజ్‌మెంట్ కోటా)కి రూ.11.5 లక్షల నుంచి రూ.14.5 లక్షల వరకు ఉంది. ఇక కేటగిరీ 'సీ' (ఎన్నారై కోటా) అడ్మిషన్ ఫీజు రూ.25 లక్షల నుంచి రూ.28 లక్షల వరకు ఉంది. పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి కేటగిరీ 'ఏ'కు రూ.7.5 లక్షలు, కేటగిరీ 'బీ'కి రూ.28 లక్షల నుంచి రూ.30లక్షల వరకు ఫీజు ఉంది. బీడీఎస్ కోర్సులకు కేటగిరీ 'ఏ'లో రూ.45 వేలు, కేటగిరీ 'బీ'లో రూ.4.2 లక్షలు ఉండగా.. కేటగిరీ 'సీ'లో రూ.ఎనిమిదిన్నర లక్షల వరకు ఉంది. వీటితోపాటు బీఎస్సీ నర్సింగ్, ఎంఎస్సీ నర్సింగ్, బీఏఎంఎస్, బీహెచ్ఎంఎస్, హోమియోపతి, పారామెడికల్ కోర్సులకు సంబంధించిన ఫీజులు కూడా కాలేజీల వారీగా భిన్నంగా ఉన్నాయి.

ఆడిట్ రిపోర్టులే కీలకం

యూజీ, పీజీ మెడికల్ కోర్సుల ఫీజు పెంపునకు కాలేజీల ఆడిట్ రిపోర్టులే కీలకం కానున్నాయి. టీఏఎఫ్‌ఆర్సీ తాజాగా ప్రతి కాలేజీ ఆడిట్ రిపోర్టును సమర్పించాలని సూచించింది. ఇందులో కాలేజీల నిర్వహణ ఖర్చులు మొదలు బోధన, బోధనేతర సిబ్బంది వేతనాలు, ల్యాబ్‌ల నిర్వహణ, ఇతర వ్యయాలకు సంబంధించిన పూర్తిస్థాయి సమాచారం ఉంటుంది. ఈ ఖర్చులు గ్రామీణ ప్రాంతాల్లోని కాలేజీల్లో ఒకరకంగా ఉంటే పట్టణ ప్రాంతాల కాలేజీల్లో మరోరకంగా ఉంటాయి. దీంతో కాలేజీ వారీగా ఆడిట్ నివేదికలను పరిశీలించాక ఫీజుల పెంపుపై టీఏఎఫ్‌ఆర్సీ ఒక అంచనాకు వస్తుంది. ఆ మేరకు ఫీజులను ప్రతిపాదిస్తూ ప్రభుత్వానికి నివేదిక ఇస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం దానిని ఆమోదిస్తే కొత్త ఫీజులు అమల్లోకి వస్తాయి.

గద్వాలలో సరెండర్ లొల్లి!

- జెడ్పీ సీఈఓ విజయనాయక్ సరెండర్
- ప్రెస్‌మీట్ పెట్టి కలెక్టర్‌పై విమర్శలు
- ఫోన్ ద్వారా మంత్రి నిరంజన్‌రెడ్డికి ఫిర్యాదు
- హాట్‌టాపిక్‌గా మారిన సరెండర్ వ్యవహారం



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: గద్వాల జిల్లా పరిషత్ సీఈఓ విజయనాయక్ సరెండర్..ఆ తర్వాత ఆమె కలెక్టర్ వల్లూరి క్రాంతిపై విమర్శలు గుప్పించడం హాట్‌టాపిక్‌గా మారింది. దీనిపై వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డికి సీఈఓ ఫిర్యాదు చేయడం చర్చనీయాంశమైంది. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ, ప్రభుత్వ పథకాల అమలులో అశ్రద్ధ వహిస్తూ, ఉన్నతాధికారుల ఆదేశాలు పాటించకుండా పరిపాలనకు ఆటంకం కలిగిస్తున్నారంటూ విజయ నాయక్‌ను పంచాయతీరాజ్‌శాఖ కమిషనరేట్‌కు సరెండర్ చేస్తూ గద్వాల కలెక్టర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రెస్‌మీట్ నుంచే మంత్రికి ఫోన్..

తనను కలెక్టర్ వల్లూరు క్రాంతి సరెండర్ చేసి అన్యాయం చేశారంటూ ప్రెస్‌మీట్ నుంచే జెడ్పీ సీఈఓ..మంత్రి నిరంజన్‌రెడ్డికి ఫోన్ చేశారు. తనను అన్యాయంగా సరెండర్ చేశారని..ఈ ఉత్తర్వులను ఆపి న్యాయం చేయాలని కోరారు. తాను జిల్లాలో నిజాయితీగా విధులు నిర్వర్తిస్తున్నానని.. విధులు ఎలా నిర్వర్తిస్తున్నానో తన టూర్ డైరీని పరిశీలించాలని కోరారు. దీనిపై మంత్రి స్పందించి.. పూర్తి వివరాలు తెలుసుకుంటానని చెప్పారు. అయితే ఆమె ఆదివారం ఉదయం 10 గంటలకు ఫోన్ చేస్తానని చెప్పగా.. ఆయన సరేనని సమాధానమిచ్చారు. కాగా.. జెడ్పీ సీఈఓ గతంలోనూ వివాదాస్పదంగా వ్యవహరించినట్లు ఉద్యోగవర్గాల్లో చర్చ జరుగుతోంది. అదనపు కలెక్టర్‌తో వాగ్వాదానికి దిగడం, మహిళా దినోత్సవం రోజు ఓ మహిళా అధికారితో గొడవపడటం వంటి ఘటనలు ఉన్నాయని.. ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ సెల్‌లో బాధితులను విజయ నాయక్ పట్టించుకోరనే ఫిర్యాదు కలెక్టర్‌కు చేరినట్లు తెలిసింది. దీంతో ఆమెపై చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది.

త్వరలో తిరుపతి నుంచి అంతర్జాతీయ విమాన సర్వీసులు

సాక్షి, అమరావతి: ప్రపంచ ప్రఖ్యాత ఆధ్యాత్మిక నగరం తిరుపతి నుంచి త్వరలో అంతర్జాతీయ విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం ఏపీ ప్రభుత్వం చేస్తున్న కృషి సత్ఫలితాలను ఇస్తోంది. ముందుగా తిరుపతి నుంచి కువైట్‌కు విమాన సర్వీసులు ప్రారంభించేలా కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, విమానయాన సంస్థలతో ఎంపీ గురుమూర్తి, ఎయిర్‌పోర్టు అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు. తిరుపతి నుంచి కువైట్‌కు సర్వీసులు నడపడానికి ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ నుంచి సంకేతాలు వచ్చాయని తిరుపతి ఎయిర్‌పోర్టు డైరెక్టర్ రాజ్‌కిషోర్ చెప్పారు.

ఎదురు కాల్పుల్లో మావోయిస్టు హతం

- మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో ఘటన
- ఘటనాస్థలం వద్ద ఆయుధాలు, నగదు స్వాధీనం


ఎన్‌కౌంటర్ స్థలంలో లభించిన తుపాకులు, సామగ్రి

చింతలమానెపల్లి/కాళేశ్వరం: మహారాష్ట్రలోని ఏటపల్లి, భామ్రాగఢ్ సమీపంలో ఉన్న గట్ట అటవీప్రాంతంలో మహారాష్ట్ర పోలీసులు, మావోయిస్టులకు మధ్య శనివారం ఉదయం ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో మావోయిస్టు సమీర్ అలియాస్ సాధులింగ మొహందా (31) మృతిచెందాడు. గడ్చిరోలి జిల్లా ఎస్పీ నీలోత్పల్ ఈ ఘటన వివరాలను వెల్లడించారు. ఆయన కథనం మేరకు గడ్చిరోలి జిల్లా భామ్రాగఢ్ సమీపంలోని తొడగట్ట ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో సీ60 యాంటీ నక్సల్స్ పోలీసు బృందం కమాండోలు గాలింపు చర్యలు చేపట్టారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో పోలీసులను గమనించిన సుమారు 60 నుంచి 70 మంది మావోయిస్టులు కాల్పులు ప్రారంభించారు. ఆత్మరక్షణ కోసం పోలీసులు కూడా ఎదురు కాల్పులు జరిపారు. సుమారు 45 నిమిషాలపాటు కాల్పులు జరిపిన మావోయిస్టులు అనంతరం అటవీప్రాంతంలో తప్పించుకుని పారిపోయారు. కాల్పుల అనంతరం గాలింపు నిర్వహించగా సమీర్ మృతదేహం లభించింది. మృతుడు భామ్రాగఢ్ తాలూకా తుమర్కోడి గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. కాగా, ఘటనా స్థలంలో ఒక 303 రైఫిల్, నాటుతుపాకీ, బర్మార్ రైఫిల్, రెండు ఎస్ఎల్ఆర్ మేగజీన్లు, 30 రౌండ్ల బుల్లెట్లు, 8ఎంఎం రైఫిల్, రూ.38వేల నగదు, ఎలక్ట్రానిక్ వస్తువులు, మావోయిస్టు యూనిఫారాలు, విప్లవ సాహిత్యం, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. తప్పించుకున్న మావోయిస్టులకోసం గాలింపు కొనసాగిస్తున్నట్లు ఎస్పీ వివరించారు. మృతిచెందిన మావోయిస్టుపై రూ. 2 లక్షల రివార్డు ఉంది. మృతదేహాన్ని ప్రత్యేక హెలికాప్టర్‌లో గడ్చిరోలి జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ప్రభుత్వ స్థలంలో గుడిసెల దహనం

పోలీసు బందోబస్తు మధ్య తగులబెట్టిన రెవెన్యూ సిబ్బంది


గుడిసెలను కూల్చి కాల్చివేస్తున్న దృశ్యం

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రభుత్వ స్థలంలో ఇళ్లు లేని నిరుపేదలు వేసుకున్న గుడిసెలను రెవెన్యూ అధికారులు, సిబ్బంది పోలీసు బందోబస్తు మధ్య శనివారం తగులబెట్టారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం నమిలిగొండలో శనివారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. గ్రామంలో ఇళ్లు లేని ఎస్సీ, బీసీ నిరుపేదలకు 1999లో అప్పటి టీడీపీ ప్రభుత్వం 180 మందికి, 2010లో కాంగ్రెస్ ప్రభుత్వం 40 మందికి మొత్తం 220 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చింది. సర్వే నంబర్ 175తో పట్టాలు ఇచ్చిన అధికారులు స్థలాలను చూపించక పోవడంతో ఏళ్ల తరబడి పేదలు ఎదురుచూస్తూనే ఉన్నారు. ఆ సర్వే నంబర్‌లోని ప్రభుత్వ స్థలంలో రైతు వేదిక, విద్యుత్ ఉప కేంద్రం కార్యాలయాన్ని నిర్మించారు. మిగతా ప్రభుత్వ స్థలంలో నాలుగు నెలల క్రితం బాధితులు గుడిసెలు వేసుకున్నారు. తమకు న్యాయం చేయాలని, గతంలో ప్రభుత్వం అందజేసిన ఇళ్ల పట్టాలతో బాధితులు తహసీల్దార్, ఆర్‌డీఓతో పాటు ఎమ్మెల్సీ కడియం, ఎమ్మెల్యే రాజయ్యకు వినతిపత్రాలు అందించారు. అయినప్పటికీ ఎవరూ స్పందించకపోగా నాలుగు నెలల్లో రెవెన్యూ సిబ్బంది పలుమార్లు గుడిసెలు తొలగించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఎన్నిమార్లు హెచ్చరించినా బాధితులు వినకపోవడంతో శనివారం మధ్యాహ్నం రెవెన్యూ అధికారులు, సిబ్బంది పోలీసు బందోబస్తుతో వచ్చి పేదలు వేసిన గుడిసెలను జేసీబీతో తొలగించి తగులబెట్టారు. విషయం తెలుసుకున్న బాధితులు అక్కడికి చేరుకునే సరికి గుడిసెలు మొత్తం కాలిబూడిదయ్యాయి. ఈ ప్రభుత్వ స్థలాన్ని ఫైర్ స్టేషన్ కోసం, పలు ప్రభుత్వ అవసరాల కోసం ఈ కేటాయించామని తహసీల్దార్ పూల్‌సింగ్ చౌహాన్ తెలిపారు. ఇళ్లు లేని పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ఆన్‌లైన్‌లో నవోదయ అడ్మిట్ కార్డులు

బిజినేపల్లి: వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశానికిగాను నిర్వహించే ప్రవేశ పరీక్ష అడ్మిట్ కార్డులను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచినట్లు ప్రిన్సిపాల్ పి.భాస్కర్‌కుమార్ శనివారం తెలిపారు. అడ్మిట్ కార్డును cbleitml.rci.gov.in వెబ్ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని ఏప్రిల్ 29న నిర్వహించే పరీక్షకు హాజరుకావాలని సూచించారు. ఏవైనా ఇబ్బందులు తలెత్తితే విద్యాలయాన్ని సంప్రదించాలని పేర్కొన్నారు.

సత్తాచాటిన పీయూ విద్యార్థులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: గేట్–2023, ఐఐటీ–జేఏఎం ప్రవేశ పరీక్ష ఫలితాల్లో పాలమూరు యూనివర్సిటీకి చెందిన అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ విద్యార్థులు సత్తా చాటారు. జాతీయస్థాయిలో ఆర్.శివకుమార్ 4,203వ ర్యాంకు, జి.శ్రావణి 3,501, డి.రాజు 4,203, వి.ప్రేమ్ 1,848వ ర్యాంకు సాధించినట్లు విభాగం హెచ్‌ఓడీ డా. ఎస్.చంద్రకిరణ్ తెలిపారు. వీరికి దేశంలోనే ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్‌లలో పీహెచ్‌డీ చేసే అవకాశం లభిస్తుందన్నారు. మానవాళికి ఉపయోగపడే కొత్త ఆవిష్కరణలు కనుగొనాలని సూచించారు. ఆయా విద్యార్థులను అభినందించారు. అధ్యాపకులు రాంమోహన్, శ్రీధర్‌రెడ్డి, రవికుమార్, ఆయేషాహష్మి,సిద్ధరామగౌడ్,జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.



పిచికారీలో జాగ్రత్తలు పాటించాలి

అడ్డాకుల: రైతులు మందుల పిచికారీ సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త డా. కవిత సూచించారు. మూసాపేట మండలం వేముల రైతువేదికలో శనివారం 50 మంది ఎస్సీ రైతులకు ఉచితంగా రక్షణ దుస్తులు, గ్లౌజ్‌లు, మాస్కులు, గమ్ బూట్లు, తల తొడుగులు, కళ్ల రక్షణ కవచాలు అందజేసి మాట్లాడారు. మందులు పిచికారీ చేసే సమయంలో నీరు తాగడం, ఆహారం తీసుకోవడం, పొగ తాగడం వంటివి చేయరాదన్నారు. చిన్న పిల్లలతో మందులు పిచికారీ చేయించొద్దని సూచించారు. అనంతరం స్నానం చేసి రక్షణ దుస్తులను శుభ్రంగా ఉతికి ఆరవేయాలన్నారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డా. భరత్‌భూషణ్, ఏఓ రాజేందర్‌రెడ్డి, మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు భాస్కర్‌చందర్‌గౌడ్, జిల్లా సభ్యుడు మల్లయ్య, సత్యనారాయణరెడ్డి, రైతులు తదితరులు ఉన్నారు.

కనులపండువగా పూల రథోత్సవం

- సిర్సనగండ్లలో మార్మోగిన శ్రీరామ నామస్మరణ


ఉత్సవ విగ్రహాలకు పూజలు చేస్తున్న ఎంపీ రాములు దంపతులు


పూల తేరు వద్ద ఆలయ చైర్మన్ తదితరులు

చారకొండ: మండలంలోని సిర్సనగండ్ల సీతారామ చంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున పూల రథోత్సవం (పూల తేరు) కనులపండువగా సాగింది. ఆలయ చైర్మన్ రామశర్మ, ఈఓ రఘు, సర్పంచ్ శారద, వివిధ గ్రామాల సర్పంచ్‌లు శ్రీను, నరేష్‌నాయక్, ప్రశాంత్, నరేందర్‌రెడ్డి, ఆలయ పాలకవర్గం, సిబ్బంది, భక్తులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకు ముందు ఉత్సవ విగ్రహాలకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేళతాళాలు, భజనలు, భక్తుల శ్రీరామ నామస్మరణ నడుమ రథం ముందుకుసాగింది. వివిధ ప్రాంతాల భక్తులు అధికసంఖ్యలో రథోత్సవానికి తరలివచ్చారు.

ఎంపీ ప్రత్యేక పూజలు..

నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు దంపతులు శనివారం స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ విగ్రహ పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేటి రాత్రి రథోత్సవం..

ఆదివారం అర్ధరాత్రి దాటాక రథోత్సవం ప్రారంభమవుతుందని.. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ చైర్మన్ ధేరం రామశర్మ, ఆలయ ఈఓ రఘు తెలిపారు.

బీచుపల్లిలో ముగిసిన బ్రహ్మోత్సవాలు



అలంపూర్: ఇటిక్యాల మండలం బీచుపల్లి కోదండ రామస్వామి దేవస్థానంలో కొనసాగిన బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగిశాయి. చివరిరోజు సుప్రభాతసేవ, నిత్యపూజలు, నిత్యహోమం, సమీపంలోని కృష్ణానదిలో చక్రస్నానం, శాంతిహోమం, మహాపూర్ణాహుతి, మహాకుంభ ప్రోక్షణ, నీరాజనం తదితర విశేష సేవలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ సురేంద్రరాజు, సుదర్శన్ నారాయణ్‌స్వామి బృందం, ఆలయ అర్చక బృందం, భక్తులు పాల్గొన్నారు.

ఆలయాలను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి


పాలెం వెంకన్న సన్నిధిలో జస్టిస్ సాంబశివరావు దంపతులతో జిల్లా న్యాయమూర్తులు

కొల్లాపూర్: హైకోర్టు న్యాయమూర్తి సాంబశివరావు దంపతులు శనివారం సోమశిలలోని ద్వాదశ జ్యోతిర్లింగ, సంగమేశ్వర, సింగోటంలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయాలను దర్శించుకున్నారు. ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయాల చరిత్రను అర్చకులను అడిగి తెలుసుకున్నారు. సమీపంలోని కృష్ణానది తీర ప్రాంతాలను తిలకించారు. వారి వెంట కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, అచ్చంపేట కోర్టుల న్యాయమూర్తులు ఆర్‌కే వెంకటరమణసుహాస్, స్వరూపకాంత్, ఉపాధ్యాయ విజయ్‌కుమార్‌తో పాటు న్యాయవాదులు, పోలీసు, కోర్టు సిబ్బంది ఉన్నారు.

పాలెం, వట్టెం ఆలయాల్లో..

బిజినేపల్లి: పాలెం, వట్టెం వేంకటేశ్వరస్వామి ఆలయాలను శనివారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి సాంబశివరావు దర్శించుకున్నారు. అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి అర్చన, హారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేసి శేషవస్త్రాలతో సత్కరించారు. పాలెం అర్చకులు ఆలయ విశిష్టత, నిర్మాణం గురించి వివరించగా.. వట్టెం ఆలయ పరిసరాలు, జలాశయం నిర్మాణ ప్రాంతాన్ని తిలకించారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు, అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా తిరుచ్చిసేవ



మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చిసేవ ఘనంగా నిర్వహించారు. ప్రతి వారం ఈ సేవా కార్యక్రమాన్ని ఆలయంలో నిర్వహిస్తారు. వివిధ రకాల ఆభరణాలు, రకరకాల పూలతో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ముస్తాబు చేసి అందంగా అలంకరించిన తిరుచ్చి వాహనంలో ఉంచి ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం సభా మండపం వరకు ఊరేగింపు నిర్వహించారు. అర్చకుల వేదమంత్రోచ్చారణలు, మేళతాళాల నడుమ ఊరేగింపు ముందుకు కదిలింది. మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తిరిగి గర్భగుడి వద్దకు తీసుకొచ్చి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందాచారితో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

కార్పొరేట్ల చేతుల్లో దేశ సంపద

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ



మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

వనపర్తి క్రైం: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేశసంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ ఆరోపించారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలోని 95 శాతం మంది ప్రజలకు మేలు చేయకుండా 5 శాతం ఉన్న సంపన్నులకు దేశసంపదను అప్పనంగా దోచిపెడుతున్నారని.. దీంతో అర్ధాకలి చావులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర సరుకులు, చమురు ధరలు విపరీతంగా పెంచి సామాన్యుల నడ్డి విరుస్తోందని మండిపడ్డారు. సామాజిక అంతరాలను పెంచుతూ కుల విభజనతో ఐక్యతను దెబ్బతీస్తోందని, దేశంలో బీసీ జనాభా నిష్పత్తి ప్రకారం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. దేశంలో బీజేపీకి వ్యతిరేకంగా పోరాటం చేసే శక్తులను కలుపుకొని సీపీఎం పని చేస్తోందన్నారు. దేశసంపద పెరగాలంటే సంక్షేమం ప్రజలందరికీ అందాలని సూచించారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి జబ్బార్, పుట్టా ఆంజనేయులు, బాల్‌రెడ్డి, రాజు, దేవేందర్, వేణుగోపాల్, రమేష్, రాజు, లక్ష్మి తదితరులు ఉన్నారు.

వివక్ష లేని సమాజం కోసం కృషి చేయాలి


పీయూలో కరపత్రాలను విడుదల చేస్తున్న పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డా.కిశోర్ తదితరులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మహనీయులను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు వివక్ష లేని సమాజం కోసం కృషి చేయాలని పీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డా.కిశోర్ సూచించారు. మహనీయుల జయంత్యుత్సవాలకు సంబంధించి పీయూ–జేఏసీ ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలను శనివారం ఇక్కడ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఈనెల 5, 11, 14వ తేదీల్లో జరిగే డా.బాబు జగ్జీవన్‌రాం, మహాత్మాజ్యోతిరావు పూలే, డా.బీఆర్ అంబేద్కర్ జయంత్యుత్సవాలను జయప్రదం చేయాలన్నారు. ఈ మహనీయులు జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నారన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని స్థాపించడంలో వారి చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో పొలిటికల్ సైన్స్ హెచ్‌ఓడీ డా.నాగం కుమారస్వామి, అధ్యాపకులు డా.భూమయ్య, జిమ్మికాటన్, పీయూ–జేఏసీ చైర్మన్ బత్తిని రాము, వైస్‌చైర్మన్ రూప్‌సింగ్‌నాయక్, కన్వీనర్ శ్రీవిద్యగౌడ్, ఎంఎస్ఎఫ్ అధికార ప్రతినిధి ఎం.గణేష్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు మారుతి తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో ప్రతి డ్రైవర్ అప్రమత్తంగా ఉండాలి


అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న డీఎఫ్ఓ సుధాకర్

మహబూబ్‌నగర్ క్రైం: వేసవిలో వాహనాల్లో అగ్ని ప్రమాదాలు జరుగుతుంటాయని, డ్రైవర్లు చాలా అప్రమత్తంగా ఉండాలని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి సుధాకర్ అన్నారు. జిల్లా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో శనివారం లారీ డ్రైవర్లు, స్కూల్ బస్సు డ్రైవర్లు, డీసీఎం డ్రైవర్లకు అగ్ని ప్రమాదాలపై ప్రత్యేక అవగాహన నిర్వహించారు. ఇంజన్‌లో సాంకేతిక లోపం, కొన్ని నిర్లక్ష్యం వల్ల చోటుచేసుకునే ప్రమాదాలు ఒక్కోసారి తీవ్ర నష్టం మిగులుస్తాయని తెలిపారు. ప్రతి డ్రైవర్ తరచూ వాహనాలు తనిఖీ చేసుకోవాలని, ముఖ్యంగా ఇంజన్ పని తీరు పరిశీలించుకోవాలన్నారు. అదేవిధంగా ఇళ్లలో సిలిండర్‌తో షార్ట్‌సర్క్యూట్ వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఎంవీఐ నరేష్, ఏడీఎఫ్ఓ ధర్మ, ఎస్ఎఫ్ఓ పద్మయ్య, ఫైర్ ఆఫీసర్ మల్లిఖార్జున్ పాల్గొన్నారు.